# తీర్పు

శ్రీ తిరుమల వెంకటేశ్వర్లు





జడ్జి రామనాథానికి ఈ కేసు వినగానే మూర్ఛవచ్చినంత పనయింది. తన పాతికేండ్ల సర్వీసులో ఇటువంటి కేసును చూడలేదు. ఎదురుగుండా చెట్టంత మనిషి నిలబడి నా భార్యను నేనే చంపేనంటే ఎలా నమ్మడం?

కోర్టంతా కిటకిటలాడుతున్నది. తుదకు ప్లీడరు ముద్దాయినిచూసి.

"నీ పేరు?"

"పుల్లయ్యండి"

"కులం?"

"కాపు"

"నిజంగా నీ భార్యను హత్య చేశావా?"

"ఎన్ని సార్లండి ఈ ప్రశ్న? నేనే నాయీ చేతులతోనే చంపాను"

"దానికి కారణం?"

"ఆ గొడవంతా మీ కనవసరం. నేనే నా భార్యను చంపాను. త్వరగా ఏ ఉరిశిక్షో ఏదో ఒకటి విధించండి."

"అదేమిటోయ్? హత్యకు కారణం?"

"ఏదో ఒకటి చంపినది నేను. సాక్ష్యం ఇరుగు పొరుగువారు."

ముద్దాయి ప్రాణంమీద ఆశలేనట్లు మాట్లాడుతున్నాడు. ప్లీడరు జడ్జివైపుతిరిగి "ముద్దాయి ఎంత అడిగినా కారణం చెప్పడంలేదండి .. హత్యచేసినట్లు మాత్రం ఒప్పుకుంటున్నాడు."

జడ్జి రామనాథం బుర్ర ఆలోచనలతో నిండిపోయింది. ఒక వేళ ముద్దాయి హత్యచేయలేదేమో? చేసినట్లు నటిస్తున్నాడేమో? లేకుంటే హత్యచేసినవాడు కోర్టుకువచ్చి హత్యచేశానని ఒప్పుకుంటాడా? కాని

ముద్దాయి హత్యచేయకుంటే ఒక నిరపరాధిని దండించినట్లవుతుంది.

జడ్జికి ఏమీతోచలేదు. ఈ హత్యమీద ఇంకా కొన్ని విషయములు రాబట్టాలనుకున్నాడు. తరువాతకాని తీర్పు చెప్పుటకు వీలులేదు. ఎలాగైనా ఈ కేసులోని కిటుకును తెలిసికోవాలనుకున్నాడు.

కేసు వారం రోజులకు వాయిదాపడింది.

♦ ♦ ♦

మర్నాడు ప్రొద్దున పుల్లడి భార్యకు అంత్యక్రియలు జరిగినవి. పుల్లయ్య భార్య చితికి స్వయంగా నిప్పుపెట్టినప్పుడుకూడ అతని ముఖంలో విచారంలేదు కాని నిరాశ కనబడింది.

జడ్జి రామనాథం పుల్లయ్య ఇరుగుపొరుగువారిని పిలిపించి అడుగగా, హత్యకు కారణం తెలియదనియు, కాని చంపినది పుల్లయ్యేననిచెప్పి వెళ్ళిపోయారు, కాని పుల్లయ్య ప్రక్కింటి రమణయ్య మాత్రం "పుల్లయ్య భార్య లీల చాల అందమైనదండి. ఒక వేళ శీలాన్ని అనుమానించి చంపేడమో?" అన్నాడు.

జడ్జికి కొంచెం అసరా దొరికినట్లయింది.

"ఆ సంగతి నీ కెలాగ తెలుసు?"

"నేను ఆ మాదిరి ఊహించానండి. ఎందుకంటే ప్రతిరోజూ పుల్లయ్య పొలం వెళ్ళిపోయిన తరువాత మా వీధిలోని శేఖరం పుల్లయ్యింటికి వెళ్తూండేవాడండి. అందువలన పుల్లయ్య అనుమానించేడేమో?"

"దీనిపై ఇంకేమైనా తెలుసా?"

"ఇంకేమీ తెలియవండి"

రమణయ్య శలవు తీసుకొని వెళ్ళిపోయాడు. ఈ కేసుపై పూర్తి విషయములు పుల్లయ్యనుండే తెలుసుకోవాలనుకొన్నాడు. ఒకవేళ పుల్లయ్య చెప్పకుంటే? ఏకాంతంగా బ్రతిమలాడితే? ఒకవేళ భార్య శీలాన్ని అనుమానించినా శేఖరాన్ని ఊరికే వదలిపెడతాడా!

అన్ని విషయాలూ పుల్లయ్యనడిగి తెలుసుకోవాలనుకున్నాడు.

మరునాడు పుల్లయ్య రామనాథాన్ని ప్రయివేటు రూములో కలసికున్నాడు. మెల్లిగా "ఎందుకు బాబు పిలిపించారు?"

"నీతో కొంచెం మాట్లాడాలి అలా కూర్చో"

పుల్లయ్య క్రింద కూర్చున్నాడు. రామనాథం సిగరెట్టు వెలిగించి.

"నీ కథేమిటో పూర్తిగా చెప్పు"

"ఇప్పుడు దేనికండి. అందులోనూ కథేముంది?"

"అది కాదోయ్! అసలు ఎందుకు చంపావ్?"

"చెప్పటం నాకు యిష్టంలేదండి. చంపినది నేనే కాబట్టి శిక్ష విధించండి."

"అదేమిటోయ్! ఊరికే అలాగంటే సరిపోతుందా? నీకు అన్యాయంగా శిక్షవేస్తే దాంట్లో న్యాయం, ధర్మం ఏముంది?"

"దీనిలో అన్యాయం ఏంలేదండి. నేను శిక్షార్హుడనే"

"అదికాదు పుల్లయ్యా. ఊరికే అలా భీష్మించుకు కూర్చుంటే ఏంలాభం? ఇంతవరకు నేను ఇటువంటి కేసును వినలేదు. ఇప్పుడు నేను బ్రతిమిలాడుతున్నాను. నాతో ఒక్కడితోచెప్పు నీ కథ."

పుల్లయ్య జవాబు చెప్పలేదు.

"ఫరవాలేదు లేచెప్పు. నేను ఇంకెవరితో చెప్పనులే!"

పుల్లయ్య ఒక వేడి నిట్టూర్పువిడిచి తన కథ ప్రారంభించాడు.

♦ ♦ ♦

"నా భార్య లీల చాల అందమైనదండి. మేమిద్దరం చాలా అన్యోన్యంగా జీవించేవారము. నాకు రెండు ఎకరాల పొలముంది. ప్రతిరోజూ ప్రొద్దునే పొలానికి వెళ్ళి సాయంత్రానికి తిరిగి వచ్చే వాడిని.

ఇలాగే చాల రోజులు గడచిపోయాయి. కాని కొన్ని రోజుల క్రిందట ఒకరిద్దరు నాతో అనడం ప్రారంభించారు శేఖరం మీ యింటికి ఎందుకొస్తాడని. అయినా నేను తొందరపడలేదు. ఒకసారి ప్రత్యక్షంగా చూస్తేగాని దేనినీ నిర్ణయించకూడదనుకొన్నాను.

ఆ రోజుకూడా ఎప్పటిలాగే భోజనంచేసి పొలానికి బయలుదేరాను. కాని కొడవలి మరచిపోవుట వలన తిరిగి ఇంటికి వచ్చాను. కాని తలుపు గడియ వేసుంది. మా యింటికి ఒకేదారి. రెండుమూడు సార్లు తట్టాక లీల తలుపు తీసింది. లీల ముఖంలో కళలేక, భయం జాస్తిగాయుంది. నాకు కొంచెం అనుమానం కలిగింది. ఎందుకలాయున్నావ్ అంటే ఏమీ లేదంది. తరువాత కొడవలికొరకు పెద్దపెట్టె దగ్గరకు వెళ్ళాను. కాని లీల అడ్డంవచ్చి,

"ఏంకావాలి ?"

"కొడవలి"

"పెట్టెలోలేదు అటకమీదయుంది కాబోలు" అన్నది తొట్రుపాటుతో.

కాని నాకు బాగా జ్ఞాపకం, నిన్న సాయంత్రం కొడవలి పెట్టెలో పెట్టానని. లీలను ప్రక్కకునెట్టి పెట్టెమూత తెరిచాను.

కాని ఆశ్చర్యం ... లోపల దృశ్యం చూడగనే నిర్ఘాంతపోయాను. లోపల నిజంగా శేఖరం!

సంగతి అర్థంచేసుకొన్నాను. శేఖరం సగంచచ్చి బయటకు వచ్చాడు. నాకు ఆవేశం వచ్చింది. కాని దీనిలో తప్పెవరిది ? లీలదేగా ? లీల రమ్మంటేగా శేఖరం వచ్చాడు. ఒక్క నిముషం ఆలోచించి శేఖరాన్ని వెళ్ళిపొమ్మన్నాను. శేఖరం వెళ్ళిపోయాడు. ఎదురుగుండా లీల. ఛీ! అది బ్రతికేం లాభం ? అటువంటి నీచురాలికి ఈ భూమ్మీద స్థానంలేదు. ఒకవేళయున్నా అందరూ తలొక విధంగా అనుకొంటారు. సంఘం వెలివేస్తుంది.

వెంటనే పెట్టెలోని బాకును తీశాను. లీల వణక సాగింది. కంఠంలో బలంగా పొడిచాను. కేకలు వేసింది. కాని మరో నిముషంలో ప్రాణాలు ఎగిరి పోయాయి. అంతలోనే ఇరుగుపొరుగు వారందరూ వచ్చారు."

పుల్లయ్యకథ ముగించి "బాబూ నా కథంతా విన్నారు. ఇక నాకు జీవితంమీద ఆశలేదు. దయచేసి రేపు మీరు మరణశిక్ష విధించాలి" అంటూ రామనాథం కాళ్ళమీద పడ్డాడు.

రామనాథం కిటికీలోనుంచి శూన్యాకాశంలోకి చూశాడు.

♦ ♦ ♦

కోర్టంతా కిటకిట లాడుతున్నది. జడ్జి రామనాథం వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

కొంచెం సేపటికి జడ్జిలేచి "పుల్లయ్య నిరపరాధి. అతను నేరస్థుడుకాడు కాబట్టి క్షమించి వదిలివేస్తున్నాము." అన్నాడు.

జనం అంతా ఆశ్చర్యపోయారు. కాని పుల్లయ్య కోపంతో "ఇదేం తీర్పండి ? నన్ను ఏముఖం పెట్టుకొని బ్రతకమంటారు. నన్ను నేను శిక్షించుకోలేనా!" అంటూ రహస్యంగా బొడ్డుక్రింద దాచుకొన్న కైజారునుతీసి గుండెలో పొడుచుకొన్నాడు. ఇంక ఈ కాగితాలు అనవసరం అని రక్తం చిమ్ముతూ జడ్జి ముందున్న కాగితాలమీదపడింది. బయట సినిమా పాట వినవస్తుంది. "కర్మదాట వశమా, నరుడా, కర్మదాటవశమా !"